కథ

# సుమ

- భమిడి వెంకటేశ్వర్లు

**అప్పారావు** ఆలోచనల మధ్య సతమత మవుతున్నాడు. ఏవో సమస్యలు... అంతకు మించి గొడవలు... కలసిరాని అదృష్టం.... పొంతనలేని నగర జీవితం... అంతా అస్తవ్యస్తంగా వుంది. ఏం చేసేందుకు తోచటం లేదు. ఇలా జరుగుతుందని అనుకోలేదు.... వూహించలేదు.

ముప్పయేళ్ళ వయసు... అయిదున్నర అడుగుల ఎత్తు... దానికి తగ్గ బరువు.... పీజీ డిగ్రీ వెరసి ప్రైవేటు ఉద్యోగంలో మూడువేల జీతం... పెళ్ళి కాలేదు కాబట్టి బతికి పోయాడు. ప్రేమించలేదు కాబట్టి ఆడగాలి - స్నేహం సోకలేదు. కాబట్టి ఓ మోస్తరు రిలీఫు. నగరానికి దూరంగా ఉన్న కాలనీలో కాంతమ్మ యింట్లో అద్దెకుంటున్నాడు. పేరుకు రెండు రూములేకాని- గట్టిగా వూపిరి పీలిస్తే ఒక రూముకిందే లెక్క.

కాంతమ్మ యింటి ఓనరుకాదు. అసలు ఓనరు అమెరికాలో వుంటూ- కాంతమ్మకు ఓ వాటా అద్దెకిచ్చి - మిగిలిన రెండు వాటాల కిరాయిలు వాడుకోమన్నాడు. కాంతమ్మకు చిన్నప్పుడే భర్త పోయాడు. బంధువులున్నారు కాని ఎవరూ ఆదుకోరు, పట్టించుకోరు. కాంతమ్మ కూడా వారిని తలవదు ఆలోచించదు.

అప్పారావుకి యిల్లు అద్దెకిస్తూ చెప్పింది కాంతమ్మ "అద్దె కరెక్టుగా యివ్వాలి. గొడవలు, తగువులు పనికిరావు. నా దూరపు బంధువుల అమ్మాయి - మనవరాలు నాతోనే వుంటుంది. అది నాకు సర్వస్వం. దాని మీద యీగవాలినా నాకు బాధగా వుంటుంది. పెళ్ళి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. ప్రస్తుతం అది ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోందిలే!" అంటూ ముందే టచింగులో పెట్టింది ఆవిడ- ఎందుకైనా మంచిదనే అభిప్రాయంతో.

"బాగుంది" అనుకున్నాడు అప్పారావు.

సుమ అందంగా వుంటుంది. వయసు వచ్చింది కాబట్టి అందాలు, సొగసులు, కొలతలు బాగా డెవలప్ అయ్యాయి. పూతరేకులా, పాలకోవాలా, పెరుగుతోట కూరలా నాజూగ్గా నవనవలాడుతూ- పిటపిటలాడుతూ, గుండె వేగం పెంచే చూపులతో, పిచ్చెక్కిస్తూంటుంది.

అప్పారావుకు ఆమెను చూస్తుంటే చలితో కూడిన వణుకు పుట్టిస్తూంటుంది.

సుమ! అందమైన పేరు. ఆమె శరీరంలోని భాగాలన్నీ నాజూగ్గా, కసిపెంచుతుంటాయి. "బోరింగు పాడయింది. నీళ్ళు రావటంలేదు. మీ బామ్మ ఎప్పుడు బాగుచేయిస్తుంది?" అని రెండుమూడు సార్లు అడిగాడు అప్పారావు.

"నాకేం తెలుసు.... వెళ్ళి ఆవిడనే అడగండి" అంది సుమ.

అప్పారావుకి బోరింగు నీళ్ళు వంటిమీద పడుతున్నంత ఆనందం సంతోషం కలిగించాయి.

"మరి మిమ్మల్ని ఏం అడగాలి"

"టీవీ సీరియల్సు, సినిమాలు, వ్యాపార ప్రకటనలు, నేను పనిచేసే కంపెనీ విశేషాలు" అంటూ నాజూగ్గా నవ్విందామె.

అప్పారావు షాకయిపోయాడు.

ఆమె చూపు ఎక్కడో కదలికను రేపేది.

"సుమ ఏమంటోంది. అది పిచ్చిపిల్ల... దానికేం తెలియదు. అద్దం ముందు నిలబడి పాస్‌పోర్టు సైజులో ఉండే అందాలంటే పొంగిపోతుంటుంది. దానికి పెళ్ళి చేయాలి. నీలాంటి మంచి కుర్రాడు దొరికితే బాగుండును" అంటూ అయిదార్లుసార్లు కాంతమ్మ అప్పారావుని లైనులో పెట్టింది.

కొన్ని రోజులు పెళ్ళి దిశగా అప్పారావు ఆలోచించాడు. కాంతమ్మకు తనమీద సదభిప్రాయమే వుందనిపించింది. అయితే సుమ అభిప్రాయం ఏమిటో?

"ఇదిగో అబ్బాయ్... నీకేం కావల్సినా సుమతో చెప్పు! నేను రాత్రి ఎనిమిది గంటలకే పడుకుంటాను. సుమ రాత్రి పదకొండు దాటితేగాని పడుకోదు'' అంటూ ప్రొసీడయింది కాంతమ్మ ఓ శుభోదయంలో.

బామ్మ గ్రీన్ సిగ్నల్ యిచ్చిందనిపించింది.

అప్పట్నుంచీ అప్పారావు సుమ గురించి సంసార పక్షంగా ఆలోచించసాగాడు. ఆమె కూడా అటు యిటూ తిరుగుతూ చూపులతోనే లైనులో పెట్టేసింది.

సుమ పనిచేసే కంపెనీలో రెడీమేడ్ దుస్తులు తయారవుతాయి. నూరు మంది సిబ్బంది వుంటారు అక్కడ రోజుకి మూడు నాలుగు లక్షల దాకా వ్యాపారం సాగుతుంది.

"నా జీవితం గురించి ఏమని చెప్పను. ట్రాజెడీ, కామెడీకాని జీవితం. బీరకాయపీచు సంబంధం వున్న అమ్మమ్మ ఆదుకోకపోతే నేనెటు పోయేదాన్నో? చదువు చెప్పించి, ఉద్యోగం యిప్పించి నన్నొక దారిలో పెట్టిందావిడ.'' అంటూ ఓరోజు కళ్ళనీళ్ళు పెట్టుకుంది సుమ.

అప్పారావు మౌనంగా విన్నాడు.

ఇదంతా తనని ట్రాప్ చేసేందుకు ఎత్తుగడగానే భావించాడు తను.

" నగరంలో ఇందిరాపార్కు, టాంకుబండు, గండిపేట, గోల్కొండ లాంటి పిక్నిక్ స్పాట్సు వున్నాయి తెలుసా'' అని ఓ ఆదివారం సాయంత్రం లవ్ సీన్ ప్రారంభంలో పలికే డైలాగు చెప్పింది సుమ.

అప్పారావు ఛాతీ ఎత్తులు మించిన స్థాయిలో పెరిగింది. తనింక ప్రొసీడైపోవచ్చనుకున్నాడు. తన గ్లామర్తో ఆమె గ్లామరు ముడిపడాలను కుంటోందని పించింది.

రకరకాల కారణాలతో కాంతమ్మ సుమ వివాహం చేయలేకపోతోంది. ముఖ్యంగా కట్నాలు, లాంఛనాలు, బహుమానాలు, ఇతర కోరికలు... వగైరా వగైరాతో.. తను చనిపోయేలోపల సుమకు వివాహం చెయ్యాలన్న ఆరాటం! తన మనవరాలిని భర్త బాగానే చూస్తున్నాడని.... సంతోష పెడుతున్నాడని ..... ఆశపడుతుందామె. తన వూహాలు నిజం కావాలని!

అందుకే అప్పారావుని వీలయినంత వరకూ దారిలో పెట్టాలని ప్రయత్నిస్తుందావిడ. పెళ్ళివేటలో దాహాలు, ఆకళ్ళు, పథకాలు రాజ్యం చేస్తున్న రోజులు! ముఖ్యంగా వివాహం వ్యాపారంగా మారిపోతున్న కలికాలం! ఇక్కడ మానవత్వం, అభిమానం, ఆప్యాయతలు - కరెన్సీ నోట్ల చప్పుళ్ళకేలొంగి పోతాయి. అది గుర్తుకొచ్చినపుడు కాంతమ్మకు దిగులు, బెంగ, విచారం.... ఫలితంగా అనారోగ్యం! ఇక్కడ ఉపన్యాసాలు, ఉపదేశాలు, సందేశాలు, సలహాలు, వార్తలకు, కెమేరాలకే పరిమితం!

సుమ అప్పారావుని గమనిస్తునే మరింత దగ్గరయ్యే ఫార్ములా ప్రయోగించింది. అలాగే అప్పారావునూ!

సుమకు బోలెడంత జనరల్ నాలెడ్జి వుంది. కాంతమ్మ విషయంలోనూ ఆమె పాజిటివుగా ఆలోచిస్తోంది. మరోవైపు అప్పారావుని గమనిస్తోంది. అయితే వారంతా "పరిధి''దాటి పోవటంలేదు.

కాంతమ్మ యిక ఆలస్యం చేయదలచుకోలేదు.

"మా సుమ గురించి ఏమిటి నీ అభిప్రాయం?'' ఓ రోజు అడిగేసింది కాంతమ్మ.

"మంచి అమ్మాయి'' అన్నాడు అప్పారావు.

"నీకిచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాను''

'అప్పుడే నాకు పెళ్లేమిటి? ప్రైవేటు ఉద్యోగిని. ఇంకా లైఫ్లో సెటిల్ కాలేదు.' అందామనుకున్నాడు. "చూద్దాం లెండి'' అని మాత్రం అన్నాడు.

సుమకు తనంటే ప్రేమ, అభిమానం వున్నాయని పించింది. అందుకే బామ్మద్వారా అడిగించిందనపించింది.

ఒకరోజు రాత్రి పదకొండు గంటలకొచ్చింది సుమ యింటికి. ఆ విషయం గురించి అప్పుడు అడగాలని పించింది. కారణం - కాంతమ్మ గాఢ నిద్రలో

వుంది. ఇహ మిగిలింది త్రామిద్దరమే! ఏకాంతంలో బోలెడంత కాలక్షేపం దొరుకుతుందనిపించింది. కాని ధైర్యం చాలలేదు.

"ఇరాత రాత్రివెక్కడున్నట్లు ".. అని అడిగితే "నా యిష్టం" అని అంటే.. ప్రశ్న - సమాధానం!

అలా మూడు రోజులు అదే సమయానికి వచ్చింది సుమ. ఇదంతా అప్పారావు గమనిస్తూనే వున్నాడు.

కనీసం కాంతమ్మతో కూడా ప్రస్తావించలేకపోయాడు అతను.

అనుమానాలు... సందేహాలు... కుతూహలాలు...

కొన్ని విషయాలు ఆడవాళ్ళు చాలా గోప్యంగా వుంచుతారు. నిజాన్ని దాచే ప్రయత్నం చేస్తారు.

మూడు నెలలు దొర్లిపోయాయి.

ఓ ఆదివారం రాత్రి పదకొండుగంటలకు పెరట్లో "వాంతి" చేసుకోవడం గమనించాడు అప్పారావు. అలాగ రెండు మూడు రోజులు చూశాడు సుమని.

అప్పారావు ఆశ్చర్యపోయాడు. పైగా పెద్ద షాక్! అనుమానం బలపడింది. ఇదంతా ఆ మూడు రోజుల లేట్ కమింగ్ ఫలితంగా తోచింది. అతిగా తింటే అజీర్ణం... వాంతులు సహజం! కాని సుమకు ఏదో ఎఫైరులో "ట్రబిల్గు" వుందనిపించింది అప్పారావుకి.

కాంతమ్మ సుమ వివాహ విషయం మరో రెండు సార్లు టచ్ చేసేటప్పటికి, అప్పారావు సందేహానికి జవాబు లభించినట్లయింది.

"బహుశా యీ వాంతికి తనని కారకుడిగా భావించి ముడిపెట్టాలనుకుంటోందేమో కాంతమ్మ!

అప్పారావు ఆలోచన!

ఈరోజుల్లో యువకులకు సెక్సు పరిజ్ఞానం బాగా వుండేందుకు సినిమాలు, సీరియల్సు, పత్రికలు, ప్రకటనలు బాగా సహకరిస్తున్నాయన్న విషయం అందరికీ తెలిసిందే! ఎలా ముందుగా జాగ్రత్తపడాలి.... వచ్చాక ఏం చేయాలి? అని కూడా తెలుసుకుంటున్నాడు. టేకిట్ ఈజీ పద్ధతిలో-మేడ్ ఈజీగా టీనేజిని పూరిస్తోన్న టెక్నాలజీ కళ్ళముందు కొచ్చేసింది.

అంతే! అప్పారావు నిశ్శబ్దంగా యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. ఈ గందరగోళాన్ని మెడకు ఎందుకు తగిలించుకోవాలి అని!

అయితే వారం తరువాత ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందామెకు.

"అప్పారావు ఎందుకు ఖాళీ చేసి వెళ్ళపోయాడు" సుమను అడిగింది కాంతమ్మ.

"ఏమో!" అంది సుమ.

రెండు నెలల తరువాత బస్టాపులో యాదృచ్ఛికంగా కనిపించింది సుమ. అప్పారావుకు ఆమెలో "వాంతి" తాలూకు ప్రోగ్రెస్సు కనిపించలేదు.

'బహుశా "తీయించేసుకుని వుంటుంది' అనుకున్నాడు అప్పారావు. ఎంతైనా ఆడవాళ్ళు కదా!

సుమ కర్టెసీగా పలకరించింది. "మీరు పనిచేసే కంపెనీ మూసేసేరట్ట కదా"

"అవును" చెప్పాడు అప్పారావు.

"మగాళ్ళకు ఉద్యోగాలు దొరుకుతాయా, మాతో పాటు మీరు పోటీపడుతున్నారు కదా" అన్నాడు వెంటనే.

సుమకు విషయం బోధపడింది.

"ఇప్పుడు మీ ఆరోగ్యం బాగుందా... వాంతులు పూర్తిగా నిలిచిపోయాయా.... మందులు బాగా వాడండి కొంతకాలం" సలహాగా చెప్పాడు.

"పరవాలేదు"

"ఒక్కొక్కసారి సరదా కాలక్షేపం కొంపముంచుతుంది" అనాలనుకున్నాడు అప్పారావు.

అతన్ను సుమను పరీక్షగా చూస్తున్నాడు.

ఆమె వానపాటలో హీరోయిన్‌లా రెచ్చకొడుతోందనిపిస్తోంది.

"ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారా" అడిగిందామె.

"ఫలితం కనిపించటం లేదు" నిర్లిప్తంగా అన్నాడు.

"కావాలంటే నేను మానేసిన కంపెనీలో చెబుతాను. పని చేయండి, మా బాసుకు చెబుతాను" అందితను.

ఎటో చూస్తున్నాడు అప్పారావు.

"పెళ్ళి చేసుకోండి, దశమారుతుంది" అంది.

సుమకు అతను చూసిన రెండు సంబంధాలు తెలుసు. కాదనడానికి బోలెడు కారణాలుంటాయి.

స్పీడు బ్రేకర్లు రోడ్లమీదే కాదు.

జీవితంలోనూ వుంటాయి.

సుమ వివాహం ఆమె పని చేసిన కంపెనీ యాజమాని కొడుకుతో అయిపోయింది. ఆ విషయం తెలిసి అప్పారావు షాకయిపోయాడు.

ఒకరోజు ఇందిరా పార్కులో సుమ కనిపించింది అప్పారావుకు. కొంచెం దూరంలో ఓ అమ్మాయి "వాంతి" చేసుకుంటోంది. "పాపం, ఏమయిందో" అన్నాడు అతను వెటకారంగా.

"మీ డైలాగుకి అర్థం ఏమిటి? వెటకారమా.... హాస్యమా! అది జాలా, సానుభూతా? ఏదీకాక మీ మనసులో ఆ అమ్మాయి ఎక్కడో కాలు జారి వుంటుంది. అందుకే ఆ వాంతి! ఆ విషయాన్ని యిలా తిప్పి చెబుతున్నారా! రోడ్‌సైడ్ ప్రేమాయణం - వాంతులతో ముగుస్తుందని మీ అభిప్రాయం కాదుకదా!" అంటూ నవ్వేసిందామె.

అప్పారావు షాకుతో భుజాలు తడుముకున్నాడు. తన డైలాగుని యిలా రిపీటు చేసిందనిపించింది.

"మరో విషయం" అంటూ ఆగింది సుమ.

"ఏమిటి?"

"మా కంపెనీ అకౌంట్సు క్లోజింగ్‌లో కొంతమంది స్టాఫుని ఆలస్యంగా పనిచేసేందు కనుమతించారు. అందుకు అదనపు అలవెన్సు లిచ్చారు. ఆరారా టిఫను, కాఫీ, కూల్ డ్రింకు లిచ్చారు.... తేరగా వచ్చాయని లాగిస్తే అప్పుడప్పుడు శరీరంకి ఇలా తిరుగుబాటు తప్పదు. నా విషయంలో "వాంతులు" దర్శనమిచ్చాయి. మీకు అది మరో విధంగా తోచింది" అంది సుమతి నవ్వుతూ.

అప్పారావు సిగ్గుతో తల దించుకున్నాడు.

"మరో విషయం" సుమ చెప్పింది.

"ఏమిటి"

మీరెప్పుడైనా వాంతులు చేసుకుంటే- మీ ఆవిడకు మీరు 'కాలుజారారని' అనుకోనీకండి. పెళ్ళి చూపులు, పెళ్ళి పీటల మీద, శోభనం గదిలో మీ ఆవిడ భళ్ళున వాంతి చేసుకుంటే - ఎక్కడో అనుభవం అని అనుమాన పడకండి" - అంటూ వెళ్ళిపోయింది.

అప్పారావు ఆలోచనలో పడిపోయాడు - తెగిపోయిన చెప్పుతో కొట్టినంత ఘాటుగా, మెత్తగా.

---

**కొత్త చింతపండు, బెల్లములలో ఉండే దోషాల యొక్క తీక్షణత ఉగాదినాటికి తగ్గి అవి అప్పటి నుండి భుజింపతగినవై ఉంటాయని మన పెద్దల అభిప్రాయం. శాస్త్రంలో వేపపువ్వు, చింతపండు, బెల్లము, నెయ్యి వీనితోనే ఉగాది పచ్చడి చేయాలని స్పష్టంగా చెప్పబడి ఉండగా వాడుకలో ఇంకా ఇందులో అనేక వస్తువులు చేర్చడం కనిపిస్తూ ఉంది.**

★★★